క్లుప్తంగా

పీవీ నర్సింహారావుకు భారతరత్న ఇవ్వాలి

మహాముత్తారం: మాజీ ప్రధాని ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీ నర్సింహారావుకు భారతరత్న ఇవ్వాలని యూత్ కాంగ్రెస్, రాష్ట్ర నేతకానీ యువజన నాయకుడు తాటిపల్లి రాజబాపు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా ఎన్నికై సేవలందించిన పీవీ నర్సింహారావుకు భారతరత్న ఇవ్వాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

మహదేవపూర్: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ప్రిన్సిపాల్ నర్సయ్య మంగళవారం గారెపల్లి సెంటర్‌లో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట అధ్యాపకులు సదశివ్, పిన్నయ్య, పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

భూపాలపల్లి రూరల్: సమాజంలో ఇవిటీజింగ్, వేధింపులపై మహిళలు, బాలికలు అప్రమత్తంగా ఉండాలని స్కాట్ ఇన్‌చార్జ్ సంజీవరావు సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్కాట్ క్యాంపులో భాగంగా మహిళల భద్రత పైన షీటీం ఆధ్వర్యంలో సింగరేణి పాఠశాల విద్యార్థులకు స్థానిక మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలు ఆపద సమయంలో షీటీం నం.8712658162, సైబర్ నేరాలకు సంబంధించి 1930 నెంబర్ కి కాల్ చేసి ఫిర్యాదును చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కాట్ మాస్టర్స్ భాస్కర్, షీం టీం సభ్యులు దేవేంద్ర, శిరిష పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన



వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని మైనారిటీ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం కుష్ఠు వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలపై పీహెచ్‌సీ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీపీఎంఓ సాంబయ్య మాట్లాడుతూ.. శరీరంపై స్పర్శలేని మచ్చలు, నరాల తిమ్మిర్లు, కనుబొమ్మలు మూతపడటం లక్షణాలు ఉంటే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. సీహెచ్ఓ సదానందం, కళాశాల ప్రిన్సిపాల్ వందన, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

శ్రీకాంత్ మృతి తీరని లోటు

టేకుమట్ల: మండలంలోని సుబ్బక్కపల్లి గ్రామానికి చెందిన బీజేవైఎం నాయకుడు పారిపెల్లి శ్రీకాంత్ మృతి పార్టీకి తీరని లోటని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గుర్రపు నాగరాజు అన్నారు. బాధిత కుటుంబ సభ్యులను నాయకులు మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట కిసాన్ మోర్చా మండల నాయకులు నాంసాని రమేష్, బొడ్డు రాజేందర్, శివ, రాజు, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలి మృతి

రేగొండ: అనారోగ్య కారణాలతో పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని రేపాకపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. రేపాకపల్లికి చెందిన భాగ్యక్క ఒంటరిగా జీవనం కొనసాగిస్తూ కొంత కాలం నుంచి అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతూ ఆస్పత్రుల చుట్టూ తిరిగిన నయం కాలేదు. దీంతో మనస్థాపం చెంది ఈ నెల 5న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి మేనల్లుడు ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

మహాముత్తారంలో..

మహాముత్తారం: పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మహబూబ్‌పల్లి గ్రామానికి చెందిన తోట రాజేందర్(32) మద్యానికి బానిసై సోమవారం పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లాకేంద్రంలోని వందపడకల ఆస్పత్రికి తరలించారు. కాగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి చెంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మోహన్‌రెడ్డి తెలిపారు.

గుడుంబా స్వాధీనం

మహదేవపూర్: మండలంలోని అంబట్‌పల్లి గ్రామంలో విశ్వసనీయ సమాచారంతో దాడులు చేసి గుడుండా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం అంబట్‌పల్లి గ్రామంలో వావిల్ల లక్ష్మి, గుజ్జుల నీలమ్మ ఇళ్లలో సోదాలు చేయగా ఇద్దరి ఇళ్లలో 170 లీటర్ల గుడుంబా లభించడంతో దానిని స్వాధీనం చేసుకోని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కానిస్టేబుళ్లు తిరుపతి, ధనుంజయ్, కిషన్ పాల్గొన్నారు.

గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్

ఏటూరునాగారం: మేడారం మహాజాతరలో జంపన్నవాగు వద్ద భక్తులు ప్రమాదానికి గురికాకుండా నిరంతరం రక్షణ కల్పించడానికి ఆదివాసీ గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని ఆదివాసీ తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, జాతీయ కార్యదర్శి పొడెం రత్నం అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గత జాతర సమయంలో జంపన్న వాగు వద్ద 200ల మందిని రాజమండ్రి నుంచి తీసుకొచ్చి ఇక్కడ డ్యూటీలను చేయించారని తెలిపారు. అలాంటి ఆనవాయితీని అధికారులు, పాలకులు మానుకోవాలన్నారు. ఐటీడీఏ నుంచి మత్స్యశాఖ సొసైటీలలో సభ్యులైన ఆదివాసీలను జంపన్నవాగు వద్ద ఏర్పాటు చేయాలన్నారు. గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసేటువంటి అవకాశం మత్స్యశాఖకు కల్పించాలన్నారు. సమ్మక్క - సారలమ్మ తల్లుల వద్ద స్థానికులం తామే సేవ చేస్తామనే ఉద్దేశంతో మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రాలను కూడా సమర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళనానికి తరలిరావాలి

మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర ప్రాంగణంలో ఈనెల 13న నిర్వహించనున్న ఆదివాసీ తెగల సమ్మేళన కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి ఆదివాసీలు తరలిరావాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో ఆదివాసీ తెగల సమ్మేళన కార్యక్రమం కరపత్రాలను తుడుందెబ్బ నాయకులు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమ్మక్క-సారలమ్మ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఆదివాసీల హక్కులు, చట్టాలను కాపాడాటానికి పోరాటం చేయాలన్నారు. రాజ్యాంగంలో మనకు ఇచ్చిన హక్కులను సాధించుకోవాలన్నారు. రాష్ట్రంలోని ఆదివాసీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పొడెం రత్నం, చంద మహేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న గొల్లపల్లి రాజేందర్‌గౌడ్

ములుగు రూరల్: రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని రాంచంద్రాపురంలో మండల అధ్యక్షుడు చాంద్‌పాషా ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాంచంద్రాపురంలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ధనసరి సీతక్క దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా చూస్తామని అన్నారు. గ్రామంలో అంతర్గత రోడ్లు, డ్రైనీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని అన్నారు. గోదావరి జలాలను రాంచంద్రాపురం చెరువులోకి విడుదల చేసి పంటలకు సాగు నీరు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి, వంచ రాంమోహన్, రంజిత్ కుమార్, రవీందర్, రాజిరెడ్డి, సాంబయ్య, ప్రతాప్‌రెడ్డి, సుధాకర్, మోహన్, జయపాల్, విరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న భవ్యశ్రీ

వెంకటాపురం(కె): మండల కేందలోని ఆరోగ్య మహిళ కేంద్రంలో మహిళలకు వైద్య పరీక్షలను ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 81 మంది మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. 30 మంది వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు ములుగు ఏరియా వైద్యశాలకు పంపించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

నామ మాత్రంగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి

ములుగు: జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. ఎంపీడీఓ ఇక్బాల్ హుస్సేన్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యవసాయశాఖ, పశుసంవర్ధక శాఖ, విద్యాశాఖ, వైద్యారోగ్యశాఖ, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, నీటిపారుదల, మత్స్యశాఖల సంబంధిత అధికారులు మూడు నెలల్లో చేపట్టిన అభివృద్ధి, నిధుల ఖర్చు వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. నూతన పంచాయతీ స్పెషల్ అధికారులు గ్రామ పంచాయతీల్లో ఈ నెల 07 నుంచి 15 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించారు.ఎంపీటీసీ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాబృందం

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని చల్వాయి గ్రామంలో ఎయిడ్స్‌పై కళాకారుల చేత వై ఆర్‌జీకేర్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి కళాబృందం నుంచి కళారంజని, సందీప్ వైఆర్‌జీ కేర్ సంస్థ నుంచి సందీప్, కిషన్ హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎవరికి ఐనా సందేహం వస్తే సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి లో ఎచ్ఐవి పరీక్ష చేయించుకోవాలి అని అన్నారు. ఎచ్ఐవీ సోకిన వారిని ప్రేమతో చేర తీసుకోవాలని, వారిని అవమానపరచవద్దు అని అన్నారు. టీబీ, సుఖ వ్యాధులపై కళాబృందం వారు ఆట, పాటలతో అవగాహన కల్గించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి భారతి, శంకర్, సిబ్బంది, కళాకారులు సురేష్, సమ్మయ్య, రజని, వెన్నెల పాల్గొన్నారు.

‘గృహజ్యోతి’ సర్వేకు సహకరించాలి



సర్వే చేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

ఏటూరునాగారం: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గృహజ్యోతి పథకం కింద అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు చేపట్టిన సర్వేకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ట్రాన్స్‌కో డీఈ పులుసం నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని ఆకులవారిఘణపురంలో విద్యుత్ వినియోగదారుల గృహజ్యోతి 200ల యూనిట్ల ఉచిత పథకంపై సర్వేను చేపట్టారు. వినియోగదారుల నుంచి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఫోన్ నంబర్స్‌తోపాటు విద్యుత్ సర్వీస్ నంబర్ వివరాలను సేకరించినట్లు ఆయన తెలిపారు. 40 వినియోగదారుల నుంచి సమాచారం సేకరించినట్లు తెలిపారు. ప్రతి వినియోగదారులు ఆధార్, రేషన్ కార్డు, ఫోన్ నంబర్లను వారి మీటర్ల వద్ద రాసి ఉంచాలని, తమకు సహకరిస్తే సర్వేను పూర్తి స్థాయిలో సకాలంలో చేయించడం జరుగుతుందన్నారు. వివరాలు వెంటనే కంప్యూటరైజేషన్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ సుధాకర్, ఏడీఈ స్వామిరెడ్డి, ఈఆర్ఓ ఏఏఓ శ్రీనయ్య, ఏఈ అశోక్ పాల్గొన్నారు.

పంటల పరిశీలన



పంట చేల వద్ద ఏడీఏ శ్రీధర్

వాజేడు: మండల పరిధిలోని కాచారంలో రైతులు సాగు చేసిన పంటలను ఏటూరునాగారం ఏడీఏ శ్రీధర్ మంగళవారం పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో రైతులు ఏ పంటలను సాగు చేశారనె విషయంపై నేరుగా వారితో మాట్లాడి వివరాలను పొందుపరిచారు. రైతులకు సాగు విధానం, తెగుళ్ల నివారణపై పలు సూచనలను చేశారు. ఆయన వెంట ఏఈఓ జాఫర్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు



గాయాలపాలైన నారాయణ

వెంకటాపురం(కె): మండల పరిధిలోని పాత మరికాల గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులకు గాయాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. బెస్తగూడెం గ్రామానికి చెందిన నారాయణ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై మరికాల వెళ్తున్నాడు. కాగా, మరికాల వైపు నుంచి ద్విచక్ర వాహనంపై ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం మద్దేడు గ్రామానికి చెందిన గోర్ల సంజయ్ వేగంగా వస్తు అదుపు చేయలేక నారాయణ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. నారాయణకు తీ వ్ర గాయాలు కాగా సంజయ్ కాలుకు గాయాలైనట్లు తెలి పారు. గాయాలపాలైన ఇరువురు వ్యక్తులను ఆటోలో వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు.



గాయాలపాలైన సంజయ్

ముగ్గురికి గాయాలు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన లక్ష్మణ్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై ఎంపీడీఓ కార్యాలయం వైపు నుంచి సెంటర్‌కు వస్తున్నాడు. ఏడుజర్లపల్లి గ్రామానికి చెందిన వినయ్, మనోజ్ అనే ఇద్దరు విద్యార్థులు ట్యూషన్ వెళ్లి తిరిగి స్కూటీపై ఇంటికి వెళ్తున్న క్రమంలో లక్ష్మణ్ వారిని ఢీ కొట్టడంతో విద్యార్థులకు గాయాలు కాగా లక్ష్మణ్‌కు కాలు విరిగింది. గాయాలపాలైన ముగ్గురు వ్యక్తులను టోలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

వెంకటాపురం(కె): ఏటూరునాగారంలో ఈ నెల 11న నిర్వహించే కరాటే పోటీల వాల్ పోస్టర్లను మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో సూర్య షోటో కాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ పాయం రమణ, వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి కరాటే పోటీలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పాయం రమణ, కరాటే మాస్టర్ గొంది హనుమంతు స్నేహిత్, సూర్యనారాయణ, మడకం చిట్టిబాబు, పూనెం శ్రీను తదితరులు ఉన్నారు.

11న బహిరంగ వేలం

మొగుళ్లపల్లి: మండలంలోని ముల్కలపల్లి, మొగుళ్లపల్లి రెండు గ్రామాల మధ్య జరిగే మినీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా ఏర్పాటు చేసే దుకాణాల సముదాయాలకు జాతర అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల11న వేలం నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు బుర్ర సదయ్య తెలిపారు. పలు దుకాణాల సముదాయాలకు నిర్వహించు వేలం పాటలో పాల్గొనాలన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందిస్తున్న భారత్

వెంకటాపురం(ఎం): మండలంలోని నర్సాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మాజీ ఎంపీపీ నల్లెల్ల కుమారస్వామి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు నల్లెల్ల భారత్ స్టడీ మెటీరియల్‌ను అందించారు. విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ గైడ్స్, పెన్నులు, పెన్సిళ్లు, ప్యాడ్లు అందించినట్లు భారత్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బద్దం లక్ష్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గండ్రత్ విజయాకర్, మావురపు తిరుపతిరెడ్డి, రమణాకర్, అజయ్, ఉపాధ్యాయులు మధుసుధన్, మంజుల, కవిత, శ్రీనివాసచార్యులు, జగదీష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బాల్కసుమన్‌పై చర్య తీసుకోవాలి



ములుగు: ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ములుగు: సీఎం రేవంత్‌రెడ్డిని పరుషపదజాలం వాడి అమానుషంగా ప్రవర్తించిన బాల్కసుమన్‌పై తగిన చర్య తీసుకోవాలని కోరుతూ యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిపై ఎవరైనా అనుచిత వాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో బండి మధు, కుక్కల నాగారాజు, తదితరులు పాల్గొన్నారు.

మంగపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి అనే గౌరవం లేకుండా రేవంత్‌రెడ్డిపై అసభ్య పదజాలంతో దూషించిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు పల్లికొండ యాదగిరి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ డిమాండ్ చేశారు. చిత్తుగా ఓడించినా సిగ్గులేకుండా అనుచితంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న హట్కర్ సమ్మయ్య

ములుగు రూరల్: ఖమ్మం జిల్లాలో ఈ నెల 11,12న నిర్వహిస్తున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ మహాసభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు హట్కర్ సమ్మయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన జాతీయ విద్యా విధానం, రాజ్యాంగ విలువలు, ఫాసిజం, ఆర్థిక సంక్షోభంపై ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయని అన్నారు. ఉద్యోగులు, మేధావులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పస్వామి, శ్యామ్ సుందర్, ధర్మయ్య, కళ్యాణి, స్వప్న , సుశీల తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల: గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండలంలోని దూద్‌పల్లి గ్రామంలో రూ.5 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే ఒడితలలో రూ.5లక్షలు, పాశిగడ్డతండాలో రూ.10లక్షలు, కొత్తపేటలో రూ.50 లక్షల నిధులతో సీసీ రోడ్లుకు శంకుస్థాపన, రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అదే విధంగా జడల్‌పేట(భీష్మనగర్)లో రూ.10లక్షలు, బావుసింగ్‌పల్లిలో రూ.5లక్షలు, చిట్యాలలో రూ.10లక్షలతో సీసీ రోడ్లుకు శంకుస్థాపన, రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అలాగే చింతకుంట రామయ్యపల్లిలో రూ.20 లక్షలు, చల్లగరిగలో 20 లక్షలు, ముచినిపర్తి రూ.5లక్షలు, వరికోల్‌పల్లి (కుమ్మరిపల్లి)లో రూ.10లక్షల నిధులతో సీసీ రోడ్లు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. గోపాలపూర్ గ్రామంలో నూతన జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

పాఠశాలల సందర్శన..

మండలంలోని జడలపేట ఉన్నత పాఠశాల, భీష్మనగర్‌లోని ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సందర్శించారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి ఆయా ప్రధానోపాధ్యాయులు తీసుకెళ్లారు. ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ గదిని, డైనింగ్ హాల్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఏస్ఈ రశిద్ షేక్, ఈఈ దిలిప్, పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ రామయ్య, తహసీల్దార్ సుమన్ ఉన్నారు.

శానిటేషన్ డ్రైవ్‌ను పకడ్బందీగా చేపట్టాలి

కాటారం: గ్రామ పంచాయతీల్లో ఈ నెల 7 నుంచి 14 వరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను పకడ్బందీగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి సంజీవరావు తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో స్పెషల్ శానిటేషన్ కార్యక్రమంపై జీపీ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. శానిటేషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని ప్రభుత్వ సంస్థలు, రోడ్ల పక్కన ఉన్న పిచ్చి మొక్కలను తొలిగించడం, తాగునీటి సరఫరా, ఉపాధిహామీ కూలీల మొబలైజేషన్, పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టడంతో పాటు జీపీల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని సూచించారు. నర్సరీల్లో మొక్కలు సరిగా పెరిగేలా చూడాలని తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఎంపీఓ ఉపేంద్రయ్య అధికారులకు వివరించారు.

సమ్మె నోటీస్ అందజేత



వినతిపత్రం అందిస్తున్న ఆశవర్కర్లు

ములుగు రూరల్: జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న దేశ వ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్ సమ్మె నోటీస్‌ను జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్యకు ఆశవర్కర్లు మంగళవారం అందజేశారు. ఆశాలు మాధవి, సుధా, రమ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆడ పిల్లలకు రక్షణ కల్పించాలి



మాట్లాడుతున్న అనూష

చిట్యాల: ఆడపిల్లలకు రక్షణ కల్పించాలని మహిళ సాధికారిక కేంద్రం ఇంచార్జీ కో- ఆర్డినేటర్ జి.అనూష అన్నారు. మంగళవారం మండలంలోని నైన్‌పాక గ్రామంలో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సంక్షేమ అధికారి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో బాలికలను రక్షిద్దాం-బాలికలను చదివిద్దాం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనూష హాజరై మాట్లాడుతూ.. ప్రజలు దేశ వ్యాప్తంగా బేటి బాచావో-బేటి పడావో నినాదంతో బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. బాలికలకు చట్టపరమైన హక్కులను, నాణ్యమైన విద్య, వైద్యం పోషకాహారాన్ని అందేలా చూడాలన్నారు. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. అలాగే బాలల సంరక్షణ అధికారి కొమురయ్య మాట్లాడుతూ.. ఐక్యరాజ్యసమితి బాలల హక్కు, హక్కుల ఒడంబడిక ప్రకారం బాలలకు హక్కులు కల్పించబడ్డాయని అన్నారు. జిల్లాలో బాలల హక్కులకు భంగం వాటిల్లితే వాటి రక్షణ, సంరక్షణకు జిల్లా బాలల పరిరక్షణ విభాగం కృషి చేస్తుందన్నారు. ఎక్కడైన పిల్లలకు ఏలాంటి సమస్యలు వస్తే 1098 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఊర్మిళ ఉన్నారు.